ఇంటర్ సప్లిమెంటరీలో 53.81 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 53.81 శాతం ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం మధ్యాహ్నం ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే. ఏలూరు జిల్లావ్యాప్తంగా మొత్తం 3,096 మందికి 1,666 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు, 53.81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇంటర్మీడియట్ జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు తెలిపారు. దీనిలో సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ కళాశాలలో 105 మందికి 61 మంది, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో 59 మందికి 17 మంది, ప్రభుత్వ కళాశాలలో 568 మందికి 370 మంది, హైస్కూల్ ప్లస్‌లో 60 మందికి 31 మంది, కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయాల్లో ఐదుగురికి ఐదుగురు, ఎయిడెడ్ కళాశాలలో 125 మందికి 48 మంది, ప్రయివేట్ కళాశాలలో 2,174 మందికి 1,134 మంది ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు.

సాగుకు సాయం ఎప్పుడో..!

ప్రారంభమైన ఖరీఫ్ సాగు - కొత్త ప్రభుత్వ రూ.20 వేలు ఆర్థిక సాయం హామీ అమలుపై చర్చ
రెండు జిల్లాల్లో 2.50 లక్షల మందికిపైగా రైతులు ఎదురుచూపు - పిఎం కిసాన్ తొలివిడత ఆర్థిక సాయం విడుదల
రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందో స్పష్టత కరువు - ఆర్థిక సాయంపై కౌలురైతులంతా గంపెడాశలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. రైతులు నారుమడులు ముమ్మరంగా వేయడం ప్రారంభించారు. దీంతో వ్యవసాయానికి ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయంపై రైతుల్లో చర్చ మొదలైంది. కొత్త ప్రభుత్వం రైతులకు అందించే రూ.20 వేలు ఆర్థిక సాయం ఎప్పుడు అందిస్తుందోనని జిల్లా రైతాంగం ఎదురుచూస్తోంది. గత ప్రభుత్వం ప్రతియేటా కేంద్రం ఇచ్చే రూ.ఆరు వేలతో కలిపి రైతుభరోసా సాయం కింద రూ.13,500 రైతుకు అందించేది. రైతుభరోసా సాయం అందుకుంటున్న రైతులు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 2.50 లక్షల మందికిపైగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం మూడు విడతలుగా రూ.ఆరు వేలు, రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలో భాగంగా మే చివరి వారంలో మొదటివిడతగా రూ.5,500, జనవరిలో రెండో విడతగా రూ. రెండువేలు రైతుభరోసా సొమ్ము జమ చేసేది. కేంద్రంలో మోడీ సర్కార్‌నే మళ్లీ అధికారంలోకి రావడంతో మంగళవారం పిఎం కిసాన్ కింద రైతులకు అందించే మొదటి విడత సొమ్మును కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో కొత్తగా టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ కూటమి ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చింది. కేంద్రం ఇచ్చే రూ.ఆరు వేలతో కలిపి రూ.20 వేలు ఇస్తుందా.. లేక రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు అందిస్తుందా ఇంకా తేలాల్సి ఉంది. కేంద్రం రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేయడంతో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఎప్పుడు అందిస్తుందోననే చర్చ రైతుల్లో కొనసాగుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు విత్తనాలతోపాటు ఎరువులు, ఇతర ఖర్చుల కోసం పెట్టుబడి అవసరం ఉంటుంది. అందుకే గత ప్రభుత్వం కూడా ఖరీఫ్ ఆరంభంలో మొదటి విడత రైతుభరోసా సొమ్ము విడుదల చేసేది. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో అనేక అనుమానాలు సైతం రైతుల్లో నెలకొన్నాయి. గత ప్రభుత్వం అందించిన రైతుభరోసా అర్హుల జాబితా ప్రకారం ఆర్థిక సాయం అందిస్తుందా.. లేక మళ్లీ అర్హుల జాబితా తయారీ కోసం ఆదేశాలు ఇస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి కోసం అందించే ఆర్థిక సాయం అందకుండా పోయే పరిస్థితి ఏర్పడనుంది. ఈ నెల 24వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. అంతకు ముందు రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కానుంది. ఈ సమావేశంలో రైతులకు అందించే ఆర్థిక సాయంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. రైతులకు అందించే ఆర్థికసాయంలో ఆలస్యం జరిగితే మాత్రం కొత్త ప్రభుత్వంపై అన్నదాత ఆగ్రహం వ్యక్తం చేసే పరిస్థితి ఏర్పడనుంది.

ఆర్థిక సాయంపై కౌలురైతుల్లో గంపెడాశలు

ప్రభుత్వం రైతులకు అందించే ఆర్థిక సాయంపై జిల్లాలోని కౌలురైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. అయితే సాగు చేస్తున్న కౌలురైతులకు కాకుండా ప్రభుత్వం పెట్టుబడి సాయం సొమ్ము వ్యవసాయం చేయని భూయజమానుల ఖాతాల్లో వేస్తోంది. దీంతో సాగు చేసే కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం అందించిన రైతుభరోసా సాయం సైతం కౌలురైతులకు పెద్దగా అందని పరిస్థితి ఉంది. టిడిపి కూటమి ఎన్నికల్లో కౌలురైతులకు పెట్టుబడి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. దీంతో ప్రభుత్వం అందించే ఆర్థికసాయం సైతం తమకు అందుతుందనే ఆశతో కౌలురైతులు ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం కౌలురైతులకు ఆర్థిక సాయం అందించేందుకు ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

ధాన్యం సొమ్ము కోసం ఎదురుచూపు

సార్వా పెట్టుబడుల కోసం కర్షకుల ఆవేదన

ధాన్యం సేకరణ(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఉంగుటూరు

దాళ్వా ధాన్యం బకాయి సొమ్ము ఎప్పుడిస్తారో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ 29 నుంచి మిల్లులకు తోలిన ధాన్యానికి నేటికీ ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాల్లో సొమ్ము జమ కాలేదు. దీంతో సార్వా పెట్టుబడుల కోసం అనేక కష్టాలు పడుతున్నామని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదిలేక అప్పులు చేయాల్సి వస్తోందని కౌలుదారులు, రైతులు వాపోతున్నారు. ఉంగుటూరు మండలంలో 23 రైతుభరోసా కేంద్రాల పరిధిలో ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 8 కొనుగోలు కేంద్రాలు కేటాయించారు. ఎ.గోకవరం, గోపీనాథపట్నం, నారాయణపురం-1, 2, బాదంపూడి, బొమ్మిడి, చేబ్రోలు-2, గొల్లగూడెం ఆర్‌బికెల ద్వారా 9500 ఎఫ్‌టిఒ (ఫార్మర్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్డర్స్) ఇచ్చారు. వీటిలో 4574 ఎఫ్‌టిఒలకు ఏప్రిల్ 29 నాటి వరకూ ధాన్యం బకాయిలు ఇచ్చారు. ఇంకా 4921 ఎఫ్‌టిఒలకు సంబంధించి రూ.64 కోట్లకు పైగా బకాయిలు విడుదల కావాల్సి ఉంది. ఆ సొమ్ము వెంటనే ఇచ్చి సార్వా పెట్టుడులకు ప్రభుత్వం సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

కాలుష్యంపై పరిశ్రమలకు నోటీసులు

కదిలిన ఉంగుటూరు పంచాయతీ పాలకవర్గం ప్రజాశక్తి కథనానికి స్పందన

నోటీసులు అందజేస్తున్న పాలకవర్గం, అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఇరిగేషన్ బోదెలో పరిశ్రమల వ్యర్థాలు కలిసిపోయి మురుగునీరు ఆగిపోయిన నేపథ్యంలో పరిశ్రమల నిర్వాహకులకు మంగళవారం నోటీసులు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి కాకర్ల వెంకట గిరిధర్ వెల్లడించారు. ఈ నెల 17న ఇరిగేషన్ బోదెలో పరిశ్రమ వ్యర్థాలు శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ పాలకవర్గంతో పాటు వైద్యఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి నోటీసులలిచ్చారు. సర్పంచి బండారు సింధు, ఉప సర్పంచి పాతూరి జగదీష్, పలువురు వార్డు సభ్యులు, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె పుష్పగుచ్ఛం అందించిన ధర్మరాజు నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలను కేంద్రమంత్రికి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం.

జంగారెడ్డిగూడెంలో పారిశుధ్యం మెరుగుపర్చాలి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పట్టణంలో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేదని, మెరుగుపర్చి వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుధ్యంపై సుమారు 45 నిమిషాల పాటు చర్చలు జరిగాయి. 21వ వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యలపై కౌన్సిలర్ కంచర్ల గీతాకుమారి అధికారులను నిలదీశారు. తాను కౌన్సిలర్‌గా గెలిచి ప్రజలకు ఏమి చేయలేకపోయానని ఆమె వాపోయారు. తన వార్డు ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సభలో విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో తాగునీటి సమస్యపై అధికారులు మాట్లాడుతూ కొత్త మోటార్లు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, దీంతో వర్షపు నీరు రోడ్లపైకి చేరి నిల్వ ఉంటుందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు కౌన్సిలర్లు చెప్పారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన చెత్త డింపింగ్ యార్డులను తలపిస్తుందన్నారు. దుర్గంధంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, దోమలు విజృంభించి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని, పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని సభ్యులు, కౌన్సిలర్లు కోరారు. కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే తీర్మానాలు చేపడుతున్నారని, ఇది సరికాదని, అందరినీ కలుపుకొని జంగారెడ్డిగూడెం పట్టణాన్ని అభివృద్ధి పథకం వైపు తీసుకెళ్లాలని పలువురు చెప్పారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని నెంబర్‌వన్‌గా ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేంద్ర కుమార్, కౌన్సిలరు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల పూర్తి లక్ష్యం

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రానున్న రోజుల్లో పూర్తి చేస్తామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడిలో ఆర్ఆర్ కళ్యాణ మండపం వద్ద టిడిపి కూటమి ఆత్మీయ అభినందన సభ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలు రోషన్‌ను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వంద రోజులు పాలనపై ప్రణాళికను సిద్ధం చేసి అధికారులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. రోడ్ల అభివృద్ధితోపాటు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని తెలిపారు. కార్యకర్తలు ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యకమంలో మాజీ ఎఎంసి చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, టిడిపి నేతలు మాటూరి వెంకటరామయ్య, కొండ్రు దేవా, బోడ అవినేష్, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ చెల్లించాలి

ఎపి వ్యకాస

మాట్లాడుతున్న జీవరత్నం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న సూరయ్య చెరువులో పర్యటించి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవరత్నంతోపాటు మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురవుతున్నారన్నారు. తక్షణమే నీడకు చలువ పందిళ్లు, తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించామని, కూలీల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి గతంలో మండల అధికారులకు దరఖాస్తులు పెట్టినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే సమ్మర్ అలవెన్స్‌తోపాటు కూలీలకు వేతనాలు విడుదల చేయాలని, రెండొందల రోజులకు పనులు పెంచి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో మండలంలోని అన్ని గ్రామాల్లోని ఉపాధి కూలీలను ఐక్యం చేసి ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు పిల్లి చంటి, జి.సూర్యకిరణ్, పి.పెద్దిరాజు, కె.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి కృషి : ఎంపిడిఒ

ప్రజాశక్తి కథనానికి స్పందన

సిల్ట్ తీస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ పరిధిలోని గోపాల్‌నగర్‌కాలనీలో నిధుల లభ్యత మేరకు డ్రెయినేజీల నిర్మాణం చేపడతామని ఎంపిడిఒ జె.స్వర్ణభారతి స్పందించారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై డ్రెయినేజీ నిర్మించండి సారూ..! శీర్షికన మంగళవారం ప్రజాశక్తితో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. మురుగు నీరు నిల్వ లేకుండా సిల్ట్‌ను తీయించి కాలువలు ఏర్పాటు చేయించారు. డ్రెయినేజీ నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకున్నందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఈదురుగాలులు, భారీ వర్షం

పలుచోట్ల రోడ్లపై కూలిన చెట్లు - పడిపోయిన విద్యుత్‌స్తంభాలు
నిలిచిన విద్యుత్ సరఫరా - రోడ్లన్నీ జలమయం - స్తంభించిన జనజీవనం

జంగారెడ్డిగూడెంలో రోడ్డుపై చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మద్ది ఆంజనేయ స్వామి ఆలయం వద్ద విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగి వ్యాపార దుకాణాలపై పడ్డాయి. జంగారెడ్డిగూడెం-ఏలూరు రోడ్డులో భారీ వృక్షం పడింది. అలాగే లక్కవరం-జంగారెడ్డిగూడెం రోడ్డు అతి భారీ వృక్షం నేలకూలింది. ఈదురు గాలులకు తాటి చెట్లు విద్యుత్ తీగలపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. భవనంపై ఉన్న హోర్డింగ్ ఎగిరి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై పడడంతో తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జంగారెడ్డిగూడెంలో పడిన విద్యుత్‌స్తంభం

కామవరపుకోట : మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో పడిన భారీ వర్షానికి కామవరపుకోట పంచాయతీ శివారు గొల్లగూడెంలో పెంకుటిల్లుపై తాటిచెట్టు పడడంతో బాలికకు గాయాలయ్యాయి. గొల్లగూడెం గ్రామానికి చెందిన నీలపాల సీతామహాలక్ష్మి బంధువులతో కలిసి తన ఇంట్లో ఉండగా ఈదురుగాలులకు ఇంటి పక్కనే ఉన్న తాటి చెట్టు పెంకుటిల్లుపై పడింది. దీంతో ఇంటిపై కప్పులో ఉన్న తాటి వాసాలు ఒక్కసారిగా విరిగి ఇంటి లోపల ఉన్న వారిపై పడ్డాయి. దీంతో సీతామహాలక్ష్మి బంధువైన బాలిక సరితకు గాయాలయ్యాయి. బాలికను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తీసుకెళ్లారు.

జీలకర్రగూడెంలో తాటిచెట్టుపై పడిన పిడుగు

తాటిచెట్టుపై పిడుగు

గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం హైస్కూల్ సమీపంలోని పశు వైద్యశాలకు దగ్గర మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడుతున్న సమయంలో అక్కడ ఉన్న ఒక తాటిచెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టుపై ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందాయి.

గొల్లగూడెంలో పెంకుటిల్లుపై పడిన తాటిచెట్టు

భీమడోలు : మండల పరిధిలో మంగళవారం సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పలు నివాస గృహాలపై భాగాలు గాలికి ఎగిరిపోయాయి. రోడ్లన్నీ, ముఖ్యంగా భీమడోలు జంక్షన్ ప్రాంతంలోని రోడ్లు జలమయమయ్యాయి. ఈ స్థితిలో ఏ ప్రాంతంలో గొయ్యి ఉందో తెలియని పరిస్థితి నెలకొనడంతో ద్విచక్ర వాహనదారులు స్వల్ప ప్రమాదాలకు గురయ్యారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వారు చెబుతున్నారు. ఈదురుగాలుల తాకిడికి భీమడోలు జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలీస్ అవుట్ పోస్టు ఎగిరిపోయింది.

గాయాలపాలైన బాలిక

నూజివీడు : మండలంలోని మీర్జాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గాలులకు ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద చెట్లు కుప్పకూలాయి. హనుమాన్ జంక్షన్ - నూజివీడు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు నేలకొరిగాయి. గ్రామంలోని పెట్రోల్ బంకు సమీపంలో చెట్లు పడిపోవడంతో వాహన చోదకుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వృక్షాలు నేలకొరకడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మోటూరు హనుమంతరావు

23వ వర్ధంతి సభలో వక్తలు


సిపిఎం జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మోటూరు హనుమంతరావు సిపిఎం, ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. మోటూరు హనుమంతరావు 23వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మోటూరి హనుమంతరావు చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు పూలమాల వేసి నివాళులర్పించగా మిగిలిన సభ్యులు పూలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ మోటూరి హనుమంతరావు సిపిఎం రాష్ట్ర నాయకులు, ప్రజాశక్తి సంపాదకులుగా దీర్ఘకాలం పని చేశారన్నారు. ఆయన మంచి ఉపన్యాసకుడు, రచయతగా ఉండేవారని తెలిపారు. సవ్యసాచి అయిన అర్జునుడి వలే ఏకకాలంలో అనేక కార్యక్రమాలు నిర్వహించగలిగే సామర్థ్యం కలిగిన వ్యక్తి మోటూరి హనుమంతరావు అని కొనియాడారు. ప్రజాప్రతినిధిగా, మంచి ఉపన్యాసకుడిగా, రచయతగా, తోటి కార్యకర్తలపై అపారమైన అభిమానంతో వ్యవహరించడంలో ఆయన గొప్పవారిగా పేరు పొందారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా, ప్రజాశక్తిని తిరిగి ప్రారంభించడమే కాకుండా దానిని గాడిలో పెట్టే విధంలో సంపాదకునిగా పని చేసిన నాయకుడు మోటూరి హనుమంతరావు అని తెలిపారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లే బాధ్యత కమ్యూనిస్టులుగా, కార్యకర్తలుగా మనపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ, సిపిఎం నాయకులు బి.సోమయ్య, కంది విశ్వనాథం, వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, కోటేశ్వరరావు, పి.సూర్యారావు, ఆర్‌విఎస్.నారాయణ, ప్రసాద్, గంగరాజు, సత్యం, సీతారాం పాల్గొన్నారు.

ప్రజాశక్తి పత్రిక తొలి సంపాదకులుగా మోటూరు హనుమంతరావు పత్రిక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ప్రజాశక్తి పత్రిక ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డెస్క్ ఇన్‌ఛార్జి విఎస్ఎస్‌వి.ప్రసాద్ కొనియాడారు. మోటూరు హనుమంతరావు 23వ వర్ధంతి కార్యక్రమం స్థానిక ప్రజాశక్తి కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా మోటూరి హనుమంతరావు చిత్రపటానికి డెస్క్ ఇన్‌ఛార్జి ప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ గంగరాజు పూలమాల వేసి నివాళులర్పించగా మిగిలిన సభ్యులు పూలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డెస్క్ ఇన్‌ఛార్జి శివప్రసాద్ మాట్లాడుతూ మోటూరి హనుమంతరావు సిపిఎం రాష్ట్ర నాయకులుగా, ప్రజాశక్తి సంపాదకులుగా దీర్ఘకాలం పనిచేశారని ఆయన మంచి ఉపన్యాసకుడు, రచయతగా ఉండేవారని కొనియాడారు. ఎంఎల్‌ఎగా, రాజ్యసభ సభ్యునిగా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా పనిచేశారన్నారు.

ప్రజాశక్తి జిల్లా కార్యాలయంలో...

ఆయన ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లే విధంగా ప్రజాశక్తి సిబ్బంది పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది సీతారాం, సాంబమూర్తి, శ్యామ్, సత్యవతి , స్పందన, లక్ష్మణ్, సునీత, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తత అవసరం

ఏలూరు కార్పొరేషన్ మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ బి.మాలతి
వసతి గృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ

వసతి గృహంలో దోమల నివారణ మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -ఏలూరు టౌన్

హాస్టల్ విద్యార్థులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏలూరు కార్పొరేషన్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.మాలతి సూచించారు. స్థానిక అమీనాపేట హాస్టల్ సముదాయంలో దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రతి హాస్టల్లో దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు. తద్వారా హాస్టల్ విద్యార్థులకు దోమల కొట్టకుండా సంరక్షించుకోవచ్చన్నారు. దోమ కాటు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమ కాటు వల్ల ప్రాణాంతక వ్యాధులైన మలేరియా, డెంగి సంక్రమించే అవకాశం ఉందని చెప్పారు. విద్యార్థులు జ్వరంతో బాధపడితే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవిందరావు, మలేరియా సూపర్‌వైజర్ వేణు, హెల్త్ అసిస్టెంట్స్ మేకా శ్రీనివాసరావు, సిహెచ్.రమేష్, బాబు, దుర్గారావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

22న వికలాంగ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 22వ తేదీన నూజివీడు బాలుర హైస్కూల్లో వికలాంగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వాగంటి పద్మావతి దేవి తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు ఎంపిడిఒ కార్యాలయంలో వికలాంగ నిర్ధారణ పరీక్షల వాల్ పోస్టర్లు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆయా గ్రామాల పరిధిలోని గ్రామస్తులకు తెలియజేయాలని, పరీక్షలను సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. వికలాంగుల నిర్ధారణ వైద్య శిబిరం ఈ నెల 22వ తేదీ నూజివీడు జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. భోజన వసతి ఉండని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌టి ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగ మల్లేశ్వరి, ఎంపిడిఒ, సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - టి.నరసాపురం

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెం గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన సెంటర్ వరకు పిల్లలందరూ బడిలో ఉండాలి అనే నినాదంతో ప్లకార్డులు, ఫ్లోర్ డిస్‌ప్లే పాఠశాలలో ప్రభుత్వం అందించే పథకాలు ప్రదర్శిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీను, రాములు, శరత్ బాబు, వాసు, మంజరీ దేవి, సుమతీ రత్నం, ప్రభాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని ఉప్పాకపాడు ఫౌండేషన్ స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నక్కా సుధాకర్ ఆధ్వర్యంలో నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ బడిలో చేరాలన్నారు. ఎంపిటిసి సభ్యులు ఇంటి మంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో గుణాత్మక విద్య బోధిస్తారన్నారు. గ్రామ పెద్దలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో బడి బయట బడికి రాని పిల్లలు ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి శ్రీను, మంచాల పెద్ద సత్యనారాయణ, దాసరి వీర్రాజు, ఉపాధ్యాయులు అల్లు శ్రీను, శ్రీదేవి, అంగన్వాడీ టీచర్ సుబ్బలక్ష్మి, ఆశావర్కర్ షేక్ ఉస్సేనా పాల్గొన్నారు.

ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోలవరం

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న పోలవరం ఎంపిడిఒ జి.శ్రీనుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎంపిడిఒ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, వ్యక్తిగత పనులకే ప్రాధాన్యతనిస్తూ విధులను విస్మరిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేని ఎంపిడిఒపై జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

ఎప్పుడూ నవ్వుతూ అందరి వాడిగా ఉండే వ్యక్తి జన సైనికుడు బర్మా రాంబాబు అని జనసేన నూజివీడు డివిజన్ నాయకులు ముత్యాల కామేష్ అన్నారు. మండలంలోని బల్లిపర్రు గ్రామానికి చెందిన బర్మా రాంబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబానికి ఎంతోకొంత ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో జనసేన నాయకులు ముత్యాల కామేష్ తన స్నేహితులతో కలిసి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. రాంబాబు తల్లిదండ్రులు, భార్య కామేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ తన మిత్రుడు జన సైనికుడు బర్మా రాంబాబు మృతి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో కాశీ కృష్ణ, ఇంటూరి చంటి, ఏలయ్య, అక్కిరెడ్డిగూడెం పిఎసిఎస్ మాజీ ఛైర్మన్ శేషగిరి పాల్గొన్నారు.

పిఎం కిసాన్ యోజన సొమ్ము జమ

ప్రజాశక్తి - భీమడోలు

పిఎం కిసాన్ యోజన పథకం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి విడతగా రూ.రెండు వేలు వంతున విడుదలయ్యాయని వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. మండల పరిధిలోని 3,256 మంది రైతులకు లబ్ధి చేకూరిందని, ఈ మేరకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ.65.12 లక్షలు జమ అయ్యాయన్నారు. మిగిలిన రెండు విడతలు రూ.నాలుగు వేలు సమయానుకూలంగా విడుదలవుతాయన్నారు.

పోలవరం : 17వ విడత పిఎం కిసాన్ నిధులు పోలవరం మండలంలో 3,792 మంది రైతులకు రూ.75.84 లక్షలు వారి ఖాతాల్లో జమ అయ్యాయని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు తెలిపారు.

అందరం కలిసి పని చేస్తేనే అభివృద్ధి : కామినేని

ప్రజాశక్తి - కైకలూరు

అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేసి కైకలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచుతామని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక సీతారామ ఫంక్షన్ హాలులో నాలుగు మండలాల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని రహదారులు, తాగునీటి సమస్య, విద్యుత్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌సి ఎంవివి.సత్యనారాయణ, ఇఇ త్రినాథ్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రికి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన రెడ్డి వెంకటేశ్వరరావు (40)కు రెండు రోజుల క్రితం కడుపు నొప్పి రావడంతో తాళలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో కుటుంబసభ్యులు ఆయనను నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాటుసారా, మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం పరిధిలో 2,245 లీటర్ల నాటుసారా, 2,065 మద్యం బాటిళ్లు, 233 బీర్ బాటిళ్లను మంగళవారం ధ్వంసం చేశారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం ధ్వంసం చేసినట్లు ఏలూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కొఠారి రామకృష్ణ తెలిపారు. అక్రమ మద్యంపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అక్రమ మద్యం కొనసాగిస్తున్న వారిపై దాడులు నిర్వహించేందుకు ప్రత్యేక దళాలు రంగంలో ఉన్నట్లు తెలిపారు.

మోటార్ చోరీపై ఫిర్యాదు

ముదినేపల్లి : మండలంలోని వణుదుర్రు గ్రామపంచాయతీ మంచినీటి పథకంలోని హెచ్‌పి మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మోటార్ విలువ రూ.15వేల ఉంటుందని చెప్పారు. దీంతో ప్రత్యామ్నాయంగా మరో మోటార్‌ను ఏర్పాటుచేసి నీటిని సరఫరా చేస్తున్నారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ చోరీకి పాల్పడిన అనుమానితులు పోలీసులు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడు మృతి

ఏలూరు స్పోర్ట్స్ : రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన భీమడోలు మండలం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన సుజన్ మహల్దార్ (24) భీమడోలు రైల్వే స్టేషన్ పాతూరు రైల్వే గేట్ సమీపంలో మంగళవారం రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అందుబాటులో ఉండని సచివాలయ సిబ్బంది!

వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లిపోతున్నారని హరిజనపేట వాసుల ఆవేదన
మధ్యాహ్నం 1.30 గంటలకే మూసివేసిన వైనం
రిజిస్టర్‌లో ఉండని సిబ్బంది సంతకాలు
ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని సచివాలయం-3 సిబ్బంది అందుబాటులో ఉండడంలేదని స్థానికులు వాపోతున్నారు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకే సచివాలయం మూసివేసి ఉందని, అధికారులకు ఫోన్ చేసినా స్పందించడంలేదని చెబుతున్నారు. హరిజనపేటలో ఎక్కడో మారుమూలన ఉన్న సచివాలయం వైపు కనీసం ఏ అధికారి కూడా కన్నెత్తి చూడడంలేదని అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది ఎవరి వ్యక్తిగత పనుల నిమిత్తం వారు వెళ్లిపోతున్నారని, ఇలా అయితే తమ సమస్యలు ఎలా పరిష్కరమవుతాయని వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు సచివాలయానికి వెళ్లగా మూసివేసి ఉంది. అక్కడ గంటన్నర సేపు వేచి ఉన్న తర్వాత మూడు గంటలకు సచివాలయ సిబ్బందిలో ఒకరు మాత్రమే వచ్చి సచివాలయాన్ని తెరిచారన్నారు. సచివాలయంలో వారి రిజిస్టర్‌ను పరిశీలించగా అందులో ఏఒక్కరి సంతకం కూడా లేదని చెప్పారు. మూవ్‌మెంట్ రిజిస్టర్లు పరిశీలించగా ఇద్దరు మాత్రమే వచ్చినట్లు ఉందని తెలిపారు. దీనిపై సచివాలయ శ్రీ అడ్మిన్ నరేంద్రబాబును అడగగా బయోమెట్రిక్ వేస్తున్నామని, రిజిస్టర్‌లో సంతకం పెట్టకపోయినా ఏం కాదని సమాధానం చెబుతున్నారన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్‌ను వివరణ కోరగా తాను చూస్తానని, సచివాలయ సిబ్బందిని అడుగుతానని సమాధానం చెప్పారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడంలేదని, వారి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లిపోతున్నారని, అధికారులు పట్టించుకోవడంలేదని, ఉన్నతాధికారులు పట్టించుకుని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మధ్యాహ్నం 1.30 గంటలకే మూసివేసి ఉన్న సచివాలయం

కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు ఇప్పుడు కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి నగర పంచాయతీలోని బాయ్స్ హైస్కూల్‌లో నాలుగు మండలాల ఎంఇఒల ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, టిడిపి చింతలపూడి మండలాధ్యక్షుడు మాటూరి వెంకట్రామయ్య, చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, జనసేన మండలాధ్యక్షుడు చీదరాల మధుబాబు పాల్గొన్నారు.

కైకలూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ అబ్రహం, ఎంఇఒ డి.రామారావు, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, ఎంపిపి అడవి కృష్ణమోహన్, జెడ్‌పిటిసి సభ్యులు బేబి పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు విద్యాదీవెన కిట్లను కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి రాణించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు బొర్రా సత్యవతి, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, ఎంఇఒ పిడుగు ప్రభాకరబాబు, ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొని 2024 -2025 విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ నరసింహారావు, ఎంఈఓ కె.నరేష్ కుమార్,పాఠశాల హెచ్‌ఎం విజయకుమార్, మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి కె.రమణ బాబు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోటు, పుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ సహేద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని ప్రగడపల్లి పంచాయతీలోని ప్రగడపల్లి, గుంజవరం గ్రామాల్లోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పాఠ్య పుస్తకాల పంపిణీ చేశారు. సర్పంచి కలుం బాపిరాజు, మాజీ ఎంపిటిసి చాపర్ల వెంకటాచలం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : రావిచెర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం షరీఫ్ ముల్లంగి మహేష్, రామకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

చింతలపూడి : పుస్తకాలు అందిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19వ తేదీ నుంచి డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకునే విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తారని ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. చింతలపూడి, పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీ-సేవా కేంద్రాలకు, మధ్యవర్తులకు డబ్బు చెల్లించే అవసరం లేకుండా నేరుగా కళాశాలలో హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలలో...

కామవరపుకోట : స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు చింతలపూడి మాజీ ఎంఎల్ఎ గంటా మురళీ రామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎయిడెడ్ విద్యా సంస్థలు రద్దు చేసి ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు నిలిపివేయాలనుకున్నారన్నారు. ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ చొరవతో మళ్లీ అడ్మిషన్లు పున:ప్రారంభించినట్లు చెప్పారు.

హోం మంత్రి అనితను కలిసిన మేఘలాదేవి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

విజయవాడలోని టిడిపి కార్యాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపినట్లు రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ మేఘలాదేవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో గాడి తప్పిన లా అండ్ ఆర్డర్‌ను సరైన రీతిలో అమలు చేయాలని, అన్యాయంగా కేసులు పెట్టిన వారిని శిక్షించాలని, రాక్షస పాలనలో మొన్నటి దాక రాష్ట్ర ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారని, వారికి మేలైన న్యాయం చేకూరేలా చేయాలని కోరినట్లు ఆమె తెలిపారు.

కామినేనికి సత్కారం

ముదినేపల్లి : మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. ముదినేపల్లిలోని హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వడాలికి చెందిన కె.బాబూరావు ఎంఎల్ఎను సత్కరించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు 150 నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు..

21న యోగా, ధ్యానం

జంగారెడ్డిగూడెం టౌన్ : పట్టణంలో శేషాద్రినగర్‌లోని ది పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీగౌరీ సుభద్ర పిరమిడ్ ధ్యాన కేంద్రం ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రాంగణంలో వాకర్స్ క్లబ్, ఆధ్యాత్మిక సంస్థలు, ఇతర యోగా, స్వచ్ఛంద సంస్థల సంయుక్త నిర్వహణలో ఈ నెల 21వ తేదీ శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు యోగా, ధ్యానం ఆరోగ్యాభిలాషులు, ధ్యానుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నామని పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ తెలిపారు. ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకూ యోగాసనాలు, ఏడున్నర వరకూ ధ్యానం అనంతరం ఎనిమిది గంటల వరకూ సత్సంగంతో పాటు శిక్షణ పూర్తిచేసుకున్న చిన్నారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తామని, అల్పాహారంతో కార్యక్రమం పూర్తవుతుందని పిరమిడ్ ప్రతినిధులు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రకటించిన నాటి నుంచి జంగారెడ్డిగూడెం పిరమిడ్ ట్రస్ట్ యోగా దినోత్సవం వివిధ సంస్థలతో కలిసి నిర్వహిస్తోందని పిరమిడ్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

బాల బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ బాల కార్మిక నిరోధక దినోత్సవం సందర్భంగా చింతలపూడి ఆంథోనీ నగర్‌లో ఎంపిపి పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు మాట్లాడుతూ బాల బాలికలు తమ హక్కులు తెలుసుకోవాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, న్యాయవాదులు ఉమర్ ఫారూఖ్, పి.డేవిడ్‌రాజు, కె.దుర్గాభవాని, సోషల్ వర్కర్ అక్బర్ అలి పాల్గొన్నారు.

'ఉద్యోగులపై అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు సరికావు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శ్రీకాకుళం జిల్లాలో జరిగిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంన్నాయుడు ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, తీవ్రంగా ఖండిస్తున్నామని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఉద్యోగులను బెదిరించడం, మాట వినని ఉద్యోగులను ఏమైనా చేస్తామని మాట్లాడడం చాలా బాధాకరమని తెలిపారు. కొంతమంది అతిగా ప్రవర్తించి తప్పు చేసిన ఉద్యోగులను, మిగిలిన ఉద్యోగులను అందరిని ఒకే రకంగా చూస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే ఈ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి సమావేశం స్థానిక ఆర్ఆర్.పేటలోని స్ఫూర్తి భవన్‌లో మంగళవారం మావూరి విజయ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డేగా ప్రభాకర్ మాట్లాడుతూ బిజెపి మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత సిఎఎన్‌పిఆర్ అమలుకు వేగంగా అడుగులు వేస్తుందని విమర్శించారు. మళ్లీ దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్యులపై భారాలు వేస్తున్నారన్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు, ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేసేలా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని, అపరిష్కృతంగా ఉన్న పారిశుధ్యం, డ్రెయినేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి పోరాటాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ఆశ్రిత పక్షపాతం నిర్మూలనకు పోరాడాలన్నారు. రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, ఆ దిశగా ఉద్యమాలను, పోరాటాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ల వర ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నందున సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజుపోతేపల్లి 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని కేతవరం 11 కెవి ఫీడర్ ఆర్‌డిఎస్ఎస్ పనులు ఈ నెల 19వ తేదీ నుంచి 21 తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ద్వారకాతిరుమలలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల తూర్పు వీధిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సింగరాయపాలెంలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మండలంలోని సింగరాయపాలెంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సింగరాయపాలెం అంగన్వాడీ కేంద్రం-3లో నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడిఎస్ సింగరాయపాలెం సెక్టర్ సూపర్‌వైజర్ ప్రసన్న, గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గిరిజ, అంగన్వాడీ కార్యకర్తలు జి.రిబ్కా, టి.భాగ్యలక్ష్మి, ఎం.భాగ్యలక్ష్మి, పి.లక్ష్మీభవాని, అంగన్వాడీ ఆయాలు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప.గో.జిల్లా
M.V.O.P.No.36/2023
బిట్వీన్ :
మన్నె వెంకట సత్యనారాయణ ...పిటీషనర్
అండ్
మౌలి శ్రీను @శ్రీరామ్ అండ్ అదర్స్ ...రెస్పాండెంట్స్
టు:
R1,R2 : మౌలి శ్రీను @శ్రీరామ్, S/o.వెంకటేశ్వరరావు, నివాసం, శ్రీరామపురం, D.N.R.కాలేజ్ రోడ్డు, భీమవరం టౌన్, ప.గో.జిల్లా. డ్రైవర్ ఆఫ్ మారుతీ స్విఫ్ట్ కారు బేరింగ్ నెం. AP35K0936.
R2 : బొలిశెట్టి సురేష్, S/o.ఆదినారాయణ, నివాసం, R/o.3-191, పంచాయతీ ఆఫీస్ రోడ్, చిన అమిరం విలేజ్, భీమవరం మండలం, ప.గో.జిల్లా. ఓనర్ ఆఫ్ మారుతీ స్విఫ్ట్ కారు బేరింగ్ నెం.AP35K0936.
మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి.నెం.36/2023లో పై తెలిపిన R1, R2 ప్రతివాదులు అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తర్వు ప్రకారం మీరు ఆగస్టు నెల 16వ తేదీ 2024వ సం॥రం ఉదయం 10.30 ని॥లకు హాజరు కావలెను. లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది : 16-08-2024
నిమ్మల వీరవెంకట సత్యనారాయణ
సెల్: 98482 13165
నిమ్మల నవీన్ - 89781 22722
అడ్వకేట్స్, భీమవరం.

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప.గో.జిల్లా
M.V.O.P.No.41/2023
బిట్వీన్ :
ఏడిద భారతీ పద్మ అండ్ అదర్స్ ...పిటీషనర్
అండ్
ముద్దల మణికంఠ ...రెస్పాండెంట్స్
టు:
R1 : ముద్దల మణికంఠ, S/o.శ్రీనివాస్, నివాసం, R/o.30-39/2, ఉగ్రింకల వారి వీధి, చెరువువాడ, పెనుగొండ విలేజ్ అండ్ మండలం, ప.గో.జిల్లా. ఓనర్ కమ్ రైడర్ of MOTOR CYCLE No.AP 39 GZ 1342.
మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి.నెం.41/2023లో పై తెలిపిన R1 ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తర్వు ప్రకారం మీరు ఆగస్టు నెల 16వ తేదీ 2024వ సం॥రం ఉదయం 10.30 ని॥లకు హాజరు కావలెను. లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది : 16-08-2024
నిమ్మల వీరవెంకట సత్యనారాయణ
సెల్: 98482 13165
నిమ్మల నవీన్ - 89781 22722
అడ్వకేట్స్, భీమవరం.

KVB Karur Vysya Bank
Smart way to bank
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
డోర్ నెం. 22-15-21, M.R.O. ఆఫీస్ ఎదురుగా, భీమవరం-1 ఫోన్ : 233652
బంగారు ఆభరణములు బహిరంగ వేలము ప్రకటన
ఈ దిగువ తెలిపిన నగలను బ్యాంకువారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయ నిర్ణయించినారు. కావున తెలియజేయడమైనది.
వేలం జరుగు తేది : 28-06-2024, సాయంత్రం 4:00 గం.కు

వ నెం.	అకౌంట్ నెం.	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బంగారం బరువు గ్రా॥లలో
1.	1431902000000404 1431952000032113 1431952000034620 1431952000035502 1431952000035518	**చెన్ను చంద్రశేఖర్** డోర్ నెం. 2-40, గూట్లపాడు, లోసరి గూట్లపాడు, భీమవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా., ఆంధ్రప్రదేశ్ - 534 239	142.10 77.20 82.80 304.30 185.20

ముఖ్య నియమ నిబంధనలు : 1. పైన తెలిపిన ఋణ గ్రహీతలకు గతంలో జారీ చేసిన నోటీసులకు (అవి అందినను లేక ఏ కారణం చేతనైనను తిరిగివచ్చినను) దీనినే ఆఖరి నోటీసుగా భావించవలసినదిగా. 2. ఒక వేళ ఋణ గ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. 3. వేలం నందు పాల్గొనదలచినవారు రూ. 10,000/- ధరావత్తు ది. 28-06-2024 మధ్యాహ్నం గం.2:00 గంటల లోగా బ్యాంకు నందు జమచేసి రిజిష్టర్ చేసికొనవలయును. ధరావత్తు చెల్లించిన వక్తిని మాత్రమే ఆక్షను హాలులోకి అనుమతించబడును. 4. విజయవంతమైన ఆపాటదారుడు వేలం తేది సాయంత్రం 4:00 గం.లోగా ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను. 5. నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరిచూసుకొనవలెను. అందుకు బ్యాంకు బాధ్యత వహించజాలదు. 6. ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండగానే వేలమును పాక్షికంగా గాని, పూర్తిగా గాని రద్దుచేయు అధికారం బ్యాంకుకు కలదు. 7. పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా రుజువులను ప్రాథమికంగా దాఖలు చేయుట తప్పనిసరి. 8. ఇతర పూర్తి నియమ నిబంధనల కొరకు బ్రాంచి నందు సంప్రదించగలరు.
భీమవరం తేది: 18-06-2024 సం/- బ్రాంచ్ మేనేజర్

ప్రకటన
నా క్లయింటు అయిన ఏలూరు జిల్లా, ఏలూరు కె.కె.రాజు గ్రీన్ సిటీ, మిని బైపాస్ రోడ్డు, ఉమా నిలయం, బి-2 బ్లాకు, ప్లాటు నెం. 304రు **కొప్పరాజు కృష్ణరావు గారి కుమారుడు కొప్పరాజు గోపికృష్ణ** అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా,
నా క్లయింటుకు, ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, బ్లాక్ 3, టి.యస్. నెం. 1777 దాఖలా చ॥గ॥ 128ల స్థలమును గురువు సాంబశివరావు గారి నుండి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం. 15113/2023రుగా రిజిష్ట్రీ చేయించుకున్న ఆసక్తి గల **లింకు దస్తావేజు నెం. 666/2011, 10665/2006** గల దస్తావేజులు ఏలూరు నగరం, వెంకటాపురం పంచాయితీ, నెహ్రూనగర్, బిట్-2, డోర్ నెం. 12-203/1 రు లోని మా క్లయింటు ఇంటిని ఖాళీ చేసే సమయంలో పోయినది. ఈ రోజు వరకు కనిపించలేదని, సదరు దస్తావేజు నెం. 666/2011, 10665/2006 ఎవ్వరికైనా దొరికిన యెడల తిరిగి నా క్లయింటు అడ్రసుకు గాని, నా యొక్క అడ్రసుకు గాని ఇవ్వగలరు.
కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ నోటరీ, ఏలూరు
సెల్: 9440111033

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం Ist జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 220/2022 in O.S. 368/2022
Between:
శ్రీమతి మంతెన కనకరత్నం -పిటీషనరు/వాది
మరియు
శ్రీ కొమ్మిన దుర్గారావు మరికొందరు -రెస్పాండెంటు/ప్రతివాది
ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా, పై నెంబరు దావా గ్రంథములోని వాది అయిన శ్రీమతి మంతెన కనకరత్నం, W/o. వెంకటస్వామి, హిందూ, స్త్రీ, వయస్సు 60 సం॥లు, చేబ్రోలు, ఉంగుటూరు (మం), ప్రస్తుతం ఏలూరు జిల్లా అను వారు శ్రీ కొమ్మిన దుర్గారావు మరికొందరిపై ఇంజక్షను దావా దాఖలు చేయగా అందులోని 6వ రెస్పాండెంటు/ప్రతివాది అయిన శ్రీమతి కొమ్మిన లక్ష్మి, W/o. late శ్రీనివాస్, స్త్రీ, వయస్సు 40 సం॥లు, చేబ్రోలు, ఉంగుటూరు (మం) అనువారు శ్రీ కోర్టు నుండి ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుటకు ప్రయత్నించుచున్నందున వారికి పేపరు పబ్లికేషను ద్వారా సమన్లు అమలు జరిపించుటకు శ్రీ కోర్టు వారు అనుమతి ఇచ్చినందున సదరు దావా గ్రంథము **ది. 22-07-2024 సం॥ తేదీన** వాయిదా ఉన్నందున మీరు (వారు) పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపరచుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున పై నెంబరు దావా తీర్మానించబడునని తెలియచేయడమైనది.
(పై కోర్టు వారి ఉత్తర్వులతో)
కొండేపాటి వెంకటేశ్వరరావు
నోటరీ & అడ్వకేట్
తాడేపల్లిగూడెం, సెల్: 9848355344

IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE CUM VII METROPOLITAN MAGISTRATE HAYATNAGAR, RANGA REDDY DIST. AT :: HAYATHNAGAR
O.S .No. 780 OF 2021
BETWEEN:
Pfizer Ltd.
The Capital,1802/1901. Plot No.C-70,G Block,Bandra Kurla Complex, Bandra (East),Mumbai 400051,
Through its C&F 'Agent,
M/s Sree Rajarajeswari Medical Agencies, Plot No.9,Bik No. 37, Autonagar., Hyderabad-500 070
Rep.by, its Authorized Signatory
Mr.N. Ramesh Chander S/o.N.Ramaswamy, Aged 49 years Occ: Employee,
...Plaintiff
AND
Mr. Ramakrishna (Proprietor)
M/S.Rohini Medicals Agenies.
Tadepalligudem, Main Road,
Tadepalligudem Madalarn,A.P-534 1 02
...Defencient
Please take notice that the Plaintiff has filed the above suit for recovery of money for Rs.1,39,062/- against you on the file of the Hon'ble Addl. Junior Civil Judge cum VII M.M Hayathnagar, that the said O.S.No.780 of 2021 is posted on 09-07-2024 at 10-30 A.M for your appearance either in person or of through an Advocate. If you fail to attend the Hon'ble Court on the said date and time matter will be decided in your absence.
(BY ORDER. OF THE COURT)
A.RAVINDER
ADVOCATE
DSNR,Hyderabad
Mob.No.9959360572,

IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE CUM VII METROPOLITAN MAGISTRATE HAYATNAGAR, RANGA REDDY DIST. AT :: HAYATHNAGAR
O.S .No. 781 OF 2021
BETWEEN:
Pfizer Products (I) Pvt. Ltd.
The Capital,1802/1901. Plot No.C-70,G Block,Bandra Kurla Complex, Bandra (East),Mumbai 400051,
Through its C&F 'Agent,
M/s Sree Rajarajeswari Medical Agencies, Plot No.9,Bik No. 37
Autonagar., Hyderabad-500 070
Rep.by, its Authorized Signatory
Mr.N.Ramesh Chander S/o.N.Ramaswamy, Aged 49 years Occ: Employee,
...Plaintiff
AND
Mr. Ramakrishna (Proprietor)
M/S.Rohini Medicals Ageneies.
Tadepalligudem, Main Road,
Tadepalligudem Madalarn,A.P-534 1 02
...Defenclent
Please take notice that the Plaintiff has filed the above suit for recovery of money for Rs.89,343/- against you on the file of the Hon'ble Addl. Junior Civil Judge cum VII M.M Hayathnagar, that the said O.S.No.781 of 2021 is posted on 09-07-2024 at 10-30 A.M for your appearance either in person or of through an Advocate. If you fail to attend the Hon'ble Court on the said date and time matter will be decided in your absence.
(BY ORDER. OF THE COURT)
A.RAVINDER
ADVOCATE
DSNR,Hyderabad
Mob.No.9959360572,